పేదల గూడుపై నేతల కన్ను

- భయాందోళనలో రాజీవ్‌నగర్ దళితులు
- తమ గృహాలు ఎప్పుడు తొలగిస్తారో అని ఆందోళన

మచిలీపట్నంటౌన్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నగరంలోని పేదలకు కంటిమీద కునుకు లేకుండా పోతోంది. పేదలు వైఎస్సార్ సీపీకి సానుకూలంగా ఉన్నారనే కారణంతో వారిపై కక్షసాధింపు చర్యలు కొనసాగుతూనే ఉన్నాయి. పేదలు తలదాచుకుంటున్న చిన్నపాటి పూరిళ్లు, రేకుల షెడ్లను పాలకుల ఆదేశాలతో ఎంఎంసీ అధికారులు కూల్చివేతలకు తెరలేపారు. నగర శివారులోని కుమ్మరిగూడెంలో పేదలు నిర్మించుకున్న దాదాపు 200లకు పైగా రేకుల షెడ్ల నివాసాలను పోలీసు నిర్బంధాల నడుమ ధ్వంసం చేశారు. ఇదే తీరు నగరంలో ఇంకా కొనసాగుతూనే ఉంది. దీంతో పలు ప్రాంతాల్లోని పేదలు తమ వంతు ఎప్పుడొస్తుందోననే భయాందోళనలతో బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారు.

30 ఏళ్లుగా నివాసం ఉంటున్న దళితులు

నగరంలోని బలరామునిపేట రాజీవ్‌నగర్ కాలనీలోని దళితులు గత కొద్ది రోజులుగా భయాందోళనకు గురవుతున్నారు. ఆ ప్రాంతంలోని ప్రైవేటు స్థలంలో 11 మంది దళితులు 30 ఏళ్లుగా పూరిళ్లు, రేకుల షెడ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్నారు. అయితే ఆ ప్రాంతంలో అధికార పార్టీకి చెందిన నాయకుల అండదండలతో వెంచర్ నిర్వాహకుడు తమ గృహాలను తొలగించాలని అధికారులపై ఒత్తిడి చేస్తున్నాడని దళితులు ఆరోపిస్తున్నారు. రోడ్డు నిర్మాణానికి ఈ స్థలం కావాలంటూ తమ గృహాలను తొలగించే ప్రయత్నం చేయిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల రెండు గృహాలను మున్సిపల్ అధికారులు తొలగించారని.. రాష్ట్ర ఎస్సీ కమిషన్ మాజీ చైర్మన్ మారుమూడి విక్టర్‌ప్రసాద్ చొరవతో మిగతా గృహాల తొలగింపును నిలిపివేశారన్నారు. అయితే వెంచర్ నిర్వాహకుడు ఈ ప్రాంతానికి సంబంధం లేని వ్యక్తులతో అధికారులకు అర్జీలు పెట్టించి తమ గృహాలను తొలగించేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నాడని తెలిపారు. రెక్క ఆడితే గాని డొక్కాడని మాలాంటి పేదల గృహాలను నాయకుల కక్షసాధింపు కోసం అధికారులు తొలగించడం ఎంత వరకు సమంజసం అని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఇప్పటికైనా స్పందించి తమ గృహాలను తొలగించకుండా చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంత దళితులు విజ్ఞప్తి చేస్తున్నారు.



రాజీవ్‌నగర్‌లో ఇటీవల గృహాల తొలగింపును అడ్డుకున్న బాధిత మహిళలు (ఫైల్)



రాజీవ్‌నగర్‌లో పేదల గృహాలు

కుల వివక్ష చూపుతున్నారు



ఎన్నో ఏళ్లుగా ఈ ప్రాంతంలో నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నాం. అగ్రకులానికి చెందిన వ్యక్తి వెంచర్‌కు దారి కోసం మా గృహాలు తొలగించేందుకు కుట్ర పన్నుతున్నారు. దళితులమనే మాపై కుల వివక్ష చూపుతూ మమ్మల్ని ఇక్కడి నుంచి పంపేసే ప్రయత్నం చేస్తున్నారు. మా గృహాలు తొలగిస్తే మేమెక్కడికి వెళ్లాలి.

– కనుమూరి లక్ష్మి, బాధితురాలు

కలెక్టర్ న్యాయం చేయాలి



30 ఏళ్లకు పైగానే ఇక్కడి స్థలంలో నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవిస్తున్న మాకు జిల్లా కలెక్టర్ డీకే బాలాజీనే న్యాయం చేయాలి. దళితులమని మాపై చిన్న చూపుతో ఇక్కడి నుంచి తరిమేసేందుకు అగ్రకులాల వారు చేస్తున్న కుట్రను గ్రహించి మాకు కలెక్టర్ న్యాయం చేయాలి. కుల వివక్ష నుంచి మమ్మల్ని రక్షించాలి.

– గురిందపల్లి రాజామణి, బాధితురాలు

ఇంటర్ సెకండియర్ పరీక్షలు ప్రారంభం

పెడన: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. పట్టణంలో శ్రీబొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన సెంటరులో 162 మంది విద్యార్థులకు 157 మంది హాజరయ్యారని చీఫ్ సూపరిండెంట్ రామారావు, డిపార్ట్‌మెంటు అధికారి మున్వనర్ తెలిపారు. విజయానంద జూనియర్ కళాశాల కేంద్రంలో 79 మందికి గాను 75 మంది హాజరయినట్లు చీఫ్ సూపరిండెంట్ హిరణ్మయి, డిపార్ట్‌మెంట్ అధికారి నిజాముద్దీన్ పేర్కొన్నారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని వారు తెలిపారు.

చల్లపల్లిలో..

చల్లపల్లి: స్థానిక పరీక్ష కేంద్రాల్లో సోమవారం 564 మంది విద్యార్థులు ఇంటర్ రెండవ సంవత్సరం తెలుగు పరీక్షకు హాజరయ్యారు. విజయ క్రాంతి జూనియర్ కళాశాలలో 312 మందికి 309 మంది హాజరుకాగా విజయ జూనియర్ కళాశాలలో 260 మందికి 255 మంది హాజరయినట్లు ఆయా పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు వెంకటేశ్వర రావు, శ్రీనివాసరావు తెలిపారు.



చల్లపల్లిలో పరీక్ష కేంద్రంలోకి వెళ్లడానికి క్యూలో ఉన్న విద్యార్థినులు

తపస్సు కాలం ప్రార్థనలకు చర్చిలు ముస్తాబు

మచిలీపట్నంటౌన్: క్రైస్తవ విశ్వాసుల తపస్సు కాలం ఈనెల 5వ తేదీన విభూది బుధవారం నుంచి ప్రారంభం కానుంది. 40 రోజుల పాటు శ్రమదినాలు ఆచరించడానికి క్రైస్తవ విశ్వాసులు చేపట్టే దీక్షల ప్రార్థనలకు నగరంలోని ఆర్సీఎం దేవాలయం సంసిద్ధమైంది. దేవాలయ ప్రాంగణంలోని 14 స్థలాలు కొత్త రూపును సంతరించుకున్నాయి. ఈ శ్రమల కాలం ప్రతి ఒక్కరికి దీవెనకరంగా మారాలని ఆశిస్తూ ప్రార్థిస్తామని పరాసుపేటలోని పరిశుద్ధ సిలువ దేవాలయం ఫాదర్ ఎస్ డేవిడ్ రాజు తెలిపారు. ఏప్రిల్ నాలుగు నుంచి ఆరవ తేదీ వరకు మూడు రోజులు పాటు మచిలీపట్నం విచారణ ప్రాంగణంలో పవిత్రాత్మ ప్రార్థనా సమావేశాలు, 10 నుంచి ఏప్రిల్ ఎనిమిదో తేదీ వరకు విచారణ పరిధిలో గల 15 సంఘాల్లో దివ్య బలి పూజలు, సిలువ మార్గాలు నిర్వహిస్తామన్నారు. ఏప్రిల్ 13న మ్రానికొమ్మల ఆదివారం ఘనంగా జరుపుకొంటామని, ఏప్రిల్ 18న పవిత్ర శుక్రవారం (గుడ్ ఫ్రైడే) సందర్భంగా నగర వీధుల్లో పరిశుద్ధ బహిరంగ సిలువ మార్గం నిర్వహించడం జరుగుతుందని వివరించారు. 19వ తేదీ పవిత్ర శనివారం రాత్రి పాస్కా జాగరణ, 20న ఈస్టర్ పండుగను అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకోవడానికి క్రైస్తవ విశ్వాసులు సమాయత్తం కావాలని ఆయన పిలుపునిచ్చారు.



శ్రమ దినాల ప్రార్థనలకు సిద్ధమైన పరిశుద్ధ సిలువ దేవాలయం

సంపద తయారీ కేంద్రాల నిర్వహణపై శిక్షణ

నాగాయలంక: చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణపై ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్ వద్ద, స్థానిక కృష్ణానది తీరంలోని కనకదుర్గమ్మ ఆలయ ఆవరణలో సోమవారం శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. నాగాయలంక, అవనిగడ్డ, కోడూరు మండలాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు, క్లాప్‌మిత్రలకు శిక్షణ ఇచ్చారు. తొలుత స్థానిక ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌లో వర్మీ కంపోస్ట్ ప్రాసెస్ ప్రక్రియను పరిశీలించారు. అనంతరం బందరు డీఎల్‌పీఓ సీతారామయ్య శిక్షణను ప్రారంభించారు. ఎంపీడీఓ జీ సుధాప్రవీణ్ మాట్లాడుతూ పారిశుద్ధ్య సిబ్బంది చేత ప్రతి ఇంటి నుంచి తడి చెత్త, పొడి చెత్త వేర్వేరుగా సేకరించి సంపద కేంద్రాలకు తరలించడం ద్వారా ఎరువును తయారు చేయాలంటూ సంబంధిత విధానాలను వివరించారు. 250మంది శిక్షణకు హాజరయ్యారు. గ్రామ సర్పంచ్ కైతేపల్లి అంకాలు, మండల ఈఓపీఆర్డీ కే అప్పలనరసమ్మ, టెక్నికల్ కోఆర్డినేటర్లు కమలాకర్, అజయ్‌కుమార్, కృష్ణవేణి, గ్రామ కార్యదర్శి పవన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



శిక్షణలో మాట్లాడుతున్న ఎంపీడీఓ సుధాప్రవీణ్

నోరూరించే జీడీలు



కృత్తివెన్నులో జీడీల తయారీకి బెల్లంపాకాన్ని సాగదీస్తున్న కార్మికులు



తినడానికి సిద్ధంగా ఉన్న జీడీలు

కృత్తివెన్ను: తియ్యగా నోరూరించే చక్కని ఆరోగ్యకరమైన జీడీలంటే ఇష్టపడని వారుండరు. ఒకప్పటికి పేరుగాంచిన వంటకం నేడు కూడా మార్కెట్‌లో తన ప్రభావాన్ని చూపుతూ ఎందరికో మంచి రుచులను పంచుతోంది. ఎన్నో సరికొత్త తినుబండరాలు వస్తున్న నేటి రోజుల్లో సైతం నాటి తరం వంటకమైన జీడీ అంటే ఇప్పటి వారు సైతం తమ జిహ్వా చాపల్యాన్ని చూపుతారు. పూర్తిగా ప్రత్యేకమైన బెల్లంతో నిర్దిష్టమైన పాకం వచ్చేవరకు ఉడకబెట్టి ఆ పాకపు కడ్డీని దుంగకు గుచ్చి సాగలాగుతూ సరిపడా గట్టిదనం వచ్చిన తర్వాత దాన్ని చిన్నచిన్న ముక్కలుగా (జీడీలు) కట్‌చేసి విక్రయిస్తారు. గ్రామీణ ప్రాంతాల్లో జరిగే అన్ని రకాల ఉత్సవాల్లో వీటికి మంచి డిమాండ్ ఉంది.

శరీరం, నేత్రాలు దానం



పార్థసారధి

పెదకళ్లేపల్లి(మోపిదేవి): శరీరం, నేత్రాల దాత గొర్రెపాటి పార్థసారధి(85) ఆదివారం రాత్రి ఇంటివద్ద అనారోగ్యంతో మృతిచెందారు. ఆయన చివరి కోరిక మేరకు శరీరాన్ని నిమ్రా మెడికల్ కాలేజీకి, నేత్రాలు ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి దానం ఇచ్చారు. పలు సేవా కార్యక్రమాలతో గ్రామస్తుల మన్ననలు పొంది, స్వచ్ఛ కళ్లేపల్లిలోనూ ముందుంటి నడిపించారని గ్రామస్తులు గుర్తు చేసుకున్నారు. మృతుని భార్య రత్నకుమారి గతంలోనే మృతి చెందింది. ఆయనకు ఇద్దరు కుమార్లు, ఒక కుమార్తె. కాగా ఒక కుమారుడు, కుమార్తె కూడా గతంలోనే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మృతితో గ్రామంలో విషాద ఛాయలు నెలకొన్నాయి. దానశీలి, సమాజ సేవ చేసిన పార్థసారధి మృతికి స్థానిక ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సంతాపం తెలియజేశారు.

ఆకట్టుకున్న కోలాటం



చల్లపల్లి: మండల పరిధిలోని లక్ష్మీపురం శ్రీదుర్గా సోమేశ్వరస్వామి ఆలయంలో ప్రదర్శించిన మహిళా మురళీ కోలాటం అందరినీ ఆకట్టుకుంది. ఘంటసాల మండలం దేవరకోటకు చెందిన గురువు మారుతీ ఆధ్వర్యంలో లక్ష్మీపురం మహిళలు శ్రీదుర్గాసోమేశ్వర మహిళా మురళీ కోలాట భక్త సమాజంగా ఏర్పడి కోలాటంలో శిక్షణ పొందారు. ఇందులో భాగంగా ఆదివారం రాత్రి ప్రదర్శన ఇచ్చారు. చక్కని పాటలకు తోడు సంగీత వాయిద్యాల నడుమ వీరి కోలాట ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది.

దారంతా గోతులే!



దుమ్ము, ధూళిలో వస్తున్న వాహనం



దుమ్ము ధూళి తట్టుకోలేక ముఖం కప్పకుని ఆటలో ప్రయాణిస్తున్న మహిళలు

- ప్రమాదకరంగా ప్రయాణం
- గుంతలమయంగా కోడూరు–అవనిగడ్డ రహదారి

కోడూరు: కోడూరు–అవనిగడ్డ ప్రధాన రహదారి గుంతమయంగా మారడంతో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. అవనిగడ్డ నుంచి కోడూరు వరకు 13 కిలోమీటర్ల మేర ప్రధాన రహదారి పూర్తిగా అధ్వానంగా మారి, అడుగుకో గుంత ఏర్పడింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రారంభించిన నూతన రహదారి నిర్మాణ పనులను కూటమి ప్రభుత్వం నిలుపుదల చేయడంతో రోడ్డు పరిస్థితి మరీ దారుణంగా మారింది. రహదారి పొడవునా కంకరరాళ్లు పైకి తేలడంతో పాటు వాహనాల రాకపోకల సమయంలో భారీగా దుమ్ము ధూళి విస్తరిస్తోంది. భారీ వాహనాల వెనుక వెళ్లే ద్విచక్రవాహనదారులు దుమ్ము ధూళిలో చిక్కుకొని పడరాని పాట్లు పడుతున్నారు. ఇక ఈ రహదారిపై ఆటలో ప్రయాణం ఓ సాహసమనే చెప్పాలి. సహజంగా రహదారి బాగుంటే 20 నిమిషాల్లో అవనిగడ్డ చేరుకుంటే, ఇప్పుడు గుంతల రహదారి పుణ్యమా అంటూ 50 నిమిషాలు పైనే పడుతోందని ఆటోవాలాలు వాపోతున్నారు.

మరమ్మతులకు గురవుతున్న వాహనాలు

కోడూరు–అవనిగడ్డ రహదారి పూర్తిగా అధ్వానంగా ఉండటంతో ఆర్టీసీ బస్సులు కూడా తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. రహదారి పొడవునా గుంతలు ఉండటంతో బస్సుల్లో కింద ఉండే ప్లాట్‌ఫాంలు కూడా కదిలిపోతున్నాయి. భారీ గుంతల్లో బస్సు చక్రం పడితే లోపల ఉన్న ప్రయాణికులు సీట్ల మధ్య నొక్కుకొని ప్రమాదాలు బారిన పడుతున్నారు. గుంతల ప్రభావంతో కోడూరు–అవనిగడ్డ బస్సు సర్వీసుల పరిస్థితి దారుణంగా మారింది. ఫ్లాట్‌ఫాంలు కింద భాగం రెండుగా నెర్రెలిచ్చి ప్రయాణికులను ఆందోళన కలిగిస్తోంది. కొన్ని బస్సు సర్వీసుల కిటికీల అద్దాలు రహదారిపై ప్రయాణిస్తుండగానే పగలిపోతున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. దీనిపై పాలకులు, అధికారులు స్పందించి వెంటనే నూతన రహదారి నిర్మాణం చేపట్టడంతో పాటు ఆర్టీసీ బస్సులకు మరమ్మతులు చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

100 మందికి వైద్య పరీక్షలు



బంటుమిల్లి: మండల పరిధిలోని నాగన్నచెరువు గ్రామంలో సోమవారం నిర్వహించిన ఉచిత దంత వైద్య శిబిరంలో 100 మంది గ్రామస్తులకు పంటి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. గ్రామ సర్పంచ్ కొప్పినీడు అరుణకుమారి ప్రారంభించిన వైద్య శిబిరంలో భీమవరం పట్టణానికి చెందిన విష్ణు దంత వైద్యశాల వైద్యులు కే శ్రీచైతన్యరామ్ బృందం ఈసీజీ తదితర పంటి పరీక్షలు చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు కొప్పినీడు శ్రీనివాసరావు, బాలాజీ, గంటయ్య, శ్రీనివాస్, కోటేశ్వరరావు పంచాయతీ పరిధిలోని నెహ్రూనగర్, లక్ష్మీపురం గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలోని మైనార్టీ గురుకుల బాలుర పాఠశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ వీ వెంకటేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదవ తరగతిలో 80, ఆరవ తరగతిలో 59, ఏడవ తరగతిలో 47, ఎనిమిదవ తరగతిలో 44 సీట్లు ఉన్నాయని తెలిపారు. ముస్లిం, బీసీ–సీ విద్యార్థులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వబడుతుందని చెప్పారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ నెల 31వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 25వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 87126 25035 నంబరును సంప్రదించాలని కోరారు.

క్లుప్తంగా

విఘ్నేశ్వరస్వామికి వెండి కిరీటం, దంతాలు బహూకరణ



పెడన: పట్టణంలోని రెండో వార్డులో వేంచేసి ఉన్న శ్రీవిఘ్నేశ్వర భజన గుడిలోని స్వామివారికి పడమట వీధికి చెందిన ఉట్ల మహాదేవమూర్తి, నాగ సోమేశ్వరమ్మ దంపతులు వెండి కిరీటం, వెండిదంతాలను అందజేశారు. సోమవారం ఇంటి నుంచి పురవీధుల్లో వెండి వస్తువులతో ఊరేగింపుగా మేళతాళాలతో ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వాటిని ఆలయ అభివృద్ధి కమిటీకి అందజేశారు.

మహిళా సాధికారతపై వ్యాస రచన పోటీలు



నాగాయలంక: ఈనెల ఎనిమిదో తేదీన మహిళా దినోత్సవం పురస్కరించుకుని మహిళా సాధికారత వారోత్సవాల్లో భాగంగా స్థానిక జెడ్పీ హైస్కూల్ ప్లస్, స్కాలర్స్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ బాలికలకు 'లింగ సమానతను ప్రోత్సహించడం, పితృస్వామిక నిబంధనలను సవాలు చేయడంలో పురుషులు పాల్గొనాల్సిన అవసరం లేదు' అనే అంశాలపై సోమవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అవనిగడ్డ సబ్ డివిజన్ పోలీస్ అధికారిణి తాళ్లూరి విద్యాశ్రీ మార్గ దర్శనం, సీఐ యువకుమార్, నాగాయలంక ఎస్‌ఐ కలిదిండి రాజేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో 120మంది బాలికలు పాల్గొన్నారు. స్కాలర్స్ అధినేత సునీల్‌కుమార్ పట్నాయక్, జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం పీవీఎస్వీ ప్రసాదరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న బడ్డీల తొలగింపు



మచిలీపట్నంటౌన్: నగరంలోని రోడ్డు మార్జిన్లలో ఉన్న బడ్డీల తొలగింపు సోమవారం కూడా కొనసాగింది. జిల్లా కోర్టు సెంటర్ నుంచి జిల్లా కోర్టుకు వెళ్లే రోడ్డు మార్జిన్‌లో ఉన్న బడ్డీలను నగరపాలకసంస్థ టౌన్ ప్లానింగ్ విభాగ సిబ్బంది క్రేన్, జేసీబీలతో తొలగించారు. నగర కమిషనర్ సీహెచ్‌వీవీఎస్ బాపిరాజు నగరంలోని పలు ప్రాంతాల్లో రోడ్డు మార్జిన్‌లలో ఏర్పాటు చేసిన బడ్డీలను ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా తొలగిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం జిల్లా కోర్టుకు వెళ్లే రోడ్డులో ఉన్న బడ్డీలను టౌన్ ప్లానింగ్ అధికారి శ్రీహరి ప్రసాద్ పర్యవేక్షణలో సిబ్బంది తొలగించారు.

గోకవరం ఉపసర్పంచి శివప్రసాద్ మృతి




కోనేరుసెంటర్: వైఎస్సార్ సీపీ నాయకుడు, గోకవరం పంచాయతీ ఉపసర్పంచ్ జల్లూరి శివప్రసాద్ సోమవారం గుండెపోటుతో మృతిచెందాడు. ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పేర్ని వెంకట్రామయ్య (నాని) గోకవరం గ్రామంలో శివప్రసాద్ భౌతికకాయానికి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. శివప్రసాద్ కుటుంబానికి వైఎస్సార్ సీపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. నివాళులర్పించిన వారిలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు లంకే వెంకటేశ్వరరావు, సర్పంచులు మట్ట మోహన నాంచారయ్య, గాజుల నాగరాజు, చందన మస్తాన్, పార్టీ నాయకులు జువ్వ నాగరాజు, జల్లూరు వెంకటనారాయణ, వెంకన్నబాబు, వన్నెంరెడ్డి రామకృష్ణ, మానేపల్లి హనుమాన్, తమ్మన ప్రసాద్, మూర్తి రెడ్డి తదితరులు ఉన్నారు.

నాగాయలంక ఎంపీడీఓగా సుధాప్రవీణ్

నాగాయలంక: స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా కోడూరు ఎంపీడీఓగా పని చేస్తున్న జీ సుధాప్రవీణ్ పూర్తి అదనపు విధులతో నియమితులయ్యారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఎంపీడీఓ ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వర్తించిన కేజే సీతారామ్ కుమార్ ఫిబ్రవరి 28న ఉద్యోగ విరమణ చేయడంతో ప్రవీణ్‌ను నియమించారు. ప్రజలు, ప్రజాప్రతినిధుల సహకారంతో మండలాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని నూతన ఇన్‌చార్జి ఎంపీడీఓ ప్రవీణ్ తెలిపారు.

గణపతికి క్షీరాభిషేకం



మచిలీపట్నం టౌన్: నగరంలోని బుట్టాయిపేటలో వేంచేసి ఉన్న శ్రీచిట్టిపిళ్లారయ్య ఆలయంలో సోమవారం గణపతిస్వామికి క్షీరాభిషేకం, గరికాభిషేకం, పుత్ర గణపతి హోమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ పూజారులు ఉదయం, సాయంత్రం వేళల్లో నిర్వహించిన ఈ పూజా కార్యక్రమాలకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. హోమం అనంతరం పూర్ణాహుతి నిర్వహించారు.

ఆలయ తొలగింపునకు శాంతి పూజలు



బంటుమిల్లి: మండల పరిధిలోని నాగేశ్వరరావుపేట పంచాయతీ శివారు జానకీరామపురం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయ తొలగింపునకు సోమవారం శాంతి పూజలు సోమవారం నిర్వహించారు. పండితులు బ్రహ్మశ్రీ కప్పగంతుల సుబ్బరామ సోమయాజులు సిద్ధాంతి పర్యవేక్షణలో ఆలయం తొలగింపు నిమిత్తం శాంతి పూజలు, హోమాలు నిర్వహించారు. ఆలయ ట్రస్టీ గంగిశెట్టి దేవానంద్ దంపతుల దీక్ష ధారణలతో పూజలు జరిగాయి. ఆలయం నిర్మించి దాదాపు 38 ఏళ్లు అవుతున్నందున ముఖ మండపం, శిఖరం, ధ్వజస్థంబం నూతన నిర్మాణ కార్యక్రమాల్లో భాగంగా శాంతి పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా కంకర గుట్ట



మలుపు వద్ద అడ్డుగా ఉన్న కంకర గుట్ట

అవనిగడ్డ: నిత్యం రద్దీగా ఉండే అవనిగడ్డ – నాగాయలంక రోడ్డులో జెడ్పీ హైస్కూల్ మలుపు వద్ద పోసిన కంకరగుట్ట వల్ల వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ ప్రాంతంలో మలుపు ఉండటం వల్ల ఎదురుగా వచ్చే వాహనాలు కనబడే విధంగా గతంలో ఎస్‌ఐ శ్రీనివాస్ కుంభాకార అద్దం ఏర్పాటు చేయించారు. మూడు నెలల క్రితం ఈ ప్రాంతంలో కంకరగుట్ట పోయడంతో అద్దం దెబ్బతింది. మలుపులో పెద్దగా పోసిన కంకర గుట్ట వల్ల ఎదురుగా వచ్చే వాహనాలు తప్పుకునేందుకు ఇబ్బందిగా మారింది. కంకరగుట్ట ఉండటం వల్ల ఒకవైపుకే వాహనాలు తప్పిస్తుండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. మూడు నెలల నుంచి మలుపు వద్ద రహదారికి అడ్డుగా ఉన్న కంకర గుట్టను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని పలువురు వాహనదారులు కోరుతున్నారు.